ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- రోగులకు మెరుగైన సేవలందించాలి
- విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ప్రభుత్వ ఏరియా దవాఖాన సందర్శన

వేములవాడ ఏరియా దవాఖానలోని పాలిటివ్ కేర్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సూపరింటెండెంట్

వేములవాడ, జనవరి11: ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ ఏరియా దవాఖాన సందర్శించి, ప్రతి వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచిందని గుర్తు చేశారు. సేవలు అందించడంలో వైద్యు లు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. ఇక్కడ సూపరింటెండెంట్ మహేశ్‌రావు, వైద్యులు ఉన్నారు.

రాజన్న ఆలయ అధికారులతో భేటీ

వేములవాడ రాజన్న ఆలయ అధికారులతో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఆలయ చైర్మన్ సమావేశ మందిరంలో ఈవో కృష్ణప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు ముందు స్వామివారిని దర్శించుకునే ఆనవాయితీతో భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశమున్నందున ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. భక్తులు రద్దీగా ఉండే ఆది, సోమ, శుక్రవారాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాజేశ్, ఆలయ స్థానాచార్యుడు భీమశంకర్, ఏఈవోలు, డీఈలు, పర్యవేక్షకులు, ఏఈలు ఉన్నారు.

వివేకానంద ఆశయాలను కొనసాగించాలి

వేములవాడ రూరల్, జనవరి 11: స్వామి వివేకానంద ఆశయాలను యువత కొనసాగించాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం అగ్రహారం శ్రీ కన్వెన్షన్‌లో నరేన్ ఫౌండేషన్, హిమాన్షి పిల్లల దవాఖాన సంయుక్తంగా నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవానికి హాజరై మాట్లాడారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్, నరేన్ ఫౌండేషన్ చైర్మన్, హిమాన్షి చిల్డ్రెన్స్ హాస్పిటల్ ఎండీ సురేంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- తంగళ్లపల్లి సర్పంచ్, కార్యదర్శి, ఏఈ ఇష్టారాజ్యం
- ప్రొటోకాల్ లేకుండానే తంగళ్లపల్లి జీపీ ఆఫీస్ ప్రారంభం
- కలెక్టర్ అనురాగ్ జయంతి ఆగ్రహం.. షోకాజ్ నోటీసులు జారీ

సిరిసిల్ల రూరల్, జనవరి 11: అతనో గ్రామ ప్రథమ పౌరుడు, బాధ్యత కలిగిన వ్యక్తి. వాళ్లు ప్రభుత్వ అధికారులు. ఒకరు పంచాయతీ కార్యదర్శి కాగా, మరొకరు పంచాయతీ రాజ్ ఏఈ. నూతన పంచాయతీ భవనం ప్రారంభోత్సవం చేయాలంటే ప్రొటోకాల్ పాటించాలి. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అవేమీ లేకుండానే ఆగమేఘాల మీద ప్రారంభించగా, ఈ విషయం మండలంలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లిలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు సమాచారం ఇవ్వకుండా సర్పంచ్ అంకారపు అనిత ప్రజాప్రతినిధులతో కలిసి రెండ్రోజుల క్రితం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించగా, కలెక్టర్ అనురాగ్ జయంతి సీరియస్ అయ్యారు. సర్పంచ్ అంకారపు అనిత, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, సంబంధిత పంచాయతీ ఏఈకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించకుండా పంచాయతీ ఆఫీస్ ప్రారంభించిన మీ పై శాఖా పరమైన చర్యలు ఎందుకు తీసుకోరాదో..? మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

అదనపుకట్నం వేధింపులకు వివాహిత బలి

- మూడు నెలల పాపను ఉయ్యాలలో పడుకోబెట్టి బలవన్మరణం
- బావుసాయిపేటలో విషాదం

కోనరావుపేట, జనవరి 11: అదనపు కట్నం వేధింపులతో ఓ వివాహిత మనస్తాపం చెందింది. మూడు నెలల పాపను ఉయ్యాలలో పడుకోబెట్టి తను ప్రాణాలు తీసుకున్నది. కోనరావుపేట ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. బావుసాయిపేటకు చెందిన అస్లాంకు వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్‌కు చెందిన సయ్యద్ రజీనా (25)తో నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడు నెలల క్రితం పాప జన్మించింది. అస్లాం పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా, రజీనా ఇంట్లోనే ఉంటుంది. కొద్దిరోజులుగా అదనపు వరకట్నం తేవాలని అత్తమామలు హైదర్, గోరిబీ, భర్త వేధిస్తుండగా, రజీనా మనస్తాపం చెందింది. గురువారం ఇంట్లో పాపను ఊయలలో పడుకోబెట్టింది. ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. అప్పుడే పనికి వెళ్లి వచ్చిన మామ ఇంటి తలుపులు వేసి ఉండడాన్ని గమనించాడు. తలుపులు కొట్టినా రజీనా బయటికి రాకపోవడంతో మరోవైపు నుంచి లోపలికి వెళ్లాడు. అప్పటికే రజీనా మృతి చెందడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలిసి రజీనా తల్లిదండ్రులు బోరున విలపించారు. అదనపు వరకట్నం వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకున్నదని తండ్రి మహమ్మద్ ఫిర్యాదు ఇచ్చాడు. ఈ మేరకు అత్తమామ, భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టర్‌కు వినతి

వేములవాడ రూరల్, జనవరి 11: రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్‌కాలనీలో సింగిల్ విండో భవన నిర్మాణానికి సహకారం అందించాలని కోరుతూ కలెక్టర్ అనురాగ్ జయంతికి విండో చైర్మన్ కృష్ణదేవరావు, జిల్లా సహకార అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి గ్రామపంచాయతీ పాలక వర్గం, సింగిల్ విండో డైరెక్టర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు సర్వసభ్య సమావేశం

చందుర్తి,జనవరి 11: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లావణ్య గురువారం ప్రకటనలో తెలిపారు. అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- 12న కేంద్రబృందం పర్యటన

కలెక్టరేట్, జనవరి 11: కేంద్ర టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి , వికసిత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి అజయ్‌గుప్తా ఆధ్వర్యంలోని కేంద్ర బృందం జిల్లాలో వికసిత్ సంకల్ప యాత్రను పరిశీలించేందుకు ఈ నెల 12న రానున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఇందుకోసం అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర బృంద పర్యటనపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కోనరావుపేట మండలం మల్కపేట, బోయినపల్లి మండలం అనంతపల్లిలో వికసిత్ సంకల్ప యాత్రను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్న దృష్ట్యా అధికారులు సర్వ సన్నద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ శాఖలు తమ యాక్టివిటీని తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో రవీందర్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, డీఏవో భాస్కర్, జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి, మిషన్ భగీరథ ఈఈ జానకి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జిందం చక్రపాణి

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జనవరి 11: క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలో రాణించి జిల్లా ఖ్యాతిని చాటాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆకాంక్షించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి జూనియర్స్ కబడ్డీ క్రీడాకారుల శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గజ్వేల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల నుంచి సత్తాచాటిన పలువురు క్రీడాకారులను ఎంపిక చేశారన్నారు. వీరికి జూనియర్ కళాశాల మైదానం వేదికగా శిక్షణ శిబిరం నిర్వహించి క్రీడా మెళకువలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అంతయ్య, రాములు, తిరుపతి, సురేశ్, నారాయణ, ముస్తఫా, రామకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, జనవరి 11: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమిని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలిసి మొక్కను అందజేశారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఇక్కడ కౌన్సిలర్లు విజయ్, కుమార్, శంకర్, శేఖర్, మహేశ్, నాయకులు రామతీర్థపు రాజు, కొండ కనకయ్య ఉన్నారు.

విద్యార్థులకు శాలువాల వితరణ

గంభీరావుపేట, జనవరి 11: రాజేశ్వర్‌రావునగర్, గజసింగవరం జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శాలువాలు వితరణ చేశారు. పాఠశాలలో చదువుకుంటున్న 180 మంది విద్యార్థులకు చలి నుంచి తట్టుకోవడానికి శాలువాలను సమకూర్చారని పాఠశాల హెచ్‌ఎంలు తెలిపారు.

చెట్టు నరికినందుకు జరిమానా

ఎల్లారెడ్డిపేట, జనవరి 11: మండల కేంద్రంలో ఇల్లు నిర్మాణం చేస్తున్న క్రమంలో రఫీక్ అనే వ్యక్తి చెట్టును నరికినందుకు రూ.10వేలు జరిమానా విధించినట్లు కార్యదర్శి దేవరాజు తెలిపారు. అనుమతి లేకుండా చెట్లను నరికితే చర్యలు తప్పవన్నారు.

జాతీయ శిబిరంలో విద్యార్థిని శిక్షణ పూర్తి

సిరిసిల్ల రూరల్, జనవరి 11: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని భవాని జాతీయ సాహస శిబిరంలో చేరి శిక్షణ పూర్తి చేసుకుంది. గురువారం కళాశాలలో విద్యార్థిని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రిన్సిపాల్ రజిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, వాణిశ్రీ, అధ్యాపకులు ఉన్నారు.

చెరువులో మునిగిన ట్రాక్టర్

- తృటిలో బయటపడిన ఎంపీటీసీ భర్త

సిరిసిల్ల రూరల్, జనవరి 11: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌లో ఎంపీటీసీ పుర్మాణి కనకలక్ష్మి భర్త లక్ష్మారెడ్డి తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. లక్ష్మారెడ్డి గురువారం ట్రాక్టర్‌తో పొలం దున్ని అనంతరం ఎల్లమ్మ చెరువులో కడగడానికి వెళ్లాడు. చెరువులో గొయ్యి ఉండడంతో ట్రాక్టర్ మునిగిపోయింది. గమనించిన లక్ష్మారెడ్డి ట్రాక్టర్ నుంచి దూకి ప్రాణాలతో బయటపడ్డారు.

ధూప దీప నైవేద్య అర్చక సంఘం

సిరిసిల్ల రూరల్, జనవరి 11: తంగళ్లపల్లి మండల ధూప,దీప నైవేద్య అర్చక సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఆంజనేయ శర్మ, ఉపాధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా ఇన్‌చార్జి వెంకటరమణాచార్యులు, రాష్ట్ర అధికార ప్రతినిధి సంతోష్ శాస్త్రి అభినందిచారు. కార్యక్రమంలో కాశీనాథశర్మ, రాజమౌళి, అశోక్, సత్యం మహేందర్‌శర్మ, నవీన్‌కుమార్, వేణుమనోహర్ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గం

వేములవాడ, జనవరి 11: వేములవాడ ఎస్‌టీవో పరిధిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష ఎన్నికలు పట్టణంలోని టీఎన్జీవో భవనంలో గురువారం జిల్లా అధ్యక్షుడు బలరాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షుడు రాజయ్య యాదవ్ మృతి చెందగా అధ్యక్ష స్థానానికి ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సత్తయ్యను ఎన్నుకున్నారు. సంఘ నాయకులు సత్తయ్య, రాజేశం, దేవయ్య ఉన్నారు.

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 11: అయోధ్య రామమందిరంలో ఈ నెల 22న జరిగే బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠను విజయవంతం చేయాలని మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నేత కోడి అంతయ్య కోరారు. గురువారం రామాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి రామాలయంలో భక్తులకు మహాఅన్నదానం చేపడుతున్నామన్నారు. మంగళవారం తంగళ్లపల్లిలో జరిగిన శ్రీరామ పూజిత అక్షింతల వితరణ సమయంలో కొందరు తన ప్రమేయం లేకుండానే తలపైపెట్టారని చెప్పారు. దీనిపై శ్రీరాముడి ఆలయంలో క్షమాపణలు కోరినట్లు తెలిపారు. ఇక్కడ రామాలయ కమిటీ అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మచ్చ శ్రీనివాస్, సంతోష్, కర్ణాకర్, పరశురాములు, మహేందర్, ఎల్లయ్య, రమేశ్, సుధాకర్, చరణ్, రామాగౌడ్, నులుగొండ శ్రీనివాస్ ఉన్నారు.

బాలసాహిత్యంలో 'చిన్ననాటి జ్ఞాపకాలు'

సిరిసిల్ల రూరల్, జనవరి 11: హైదరాబాద్‌లోని మాచినేని బాల సాహిత్యంలో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి చెల్లం అక్షిత (8వ తరగతి) రాసిన కథ 'చిన్ననాటి జ్ఞాపకాలు' ఎంపికైంది. గురువారం పాఠశాల ఆవరణలో అక్షితను హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు అభినందించారు. అక్షిత తన నానమ్మ ద్వారా ఆమె చిన్ననాటి అనుభవాలను సేకరించి, వాటిని కథల రూపంలో రాసి, మాచినేని బాలసాహిత్యానికి ఆన్‌లైన్‌లో పంపించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గణేశ్, ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, రిటైర్డ్ టీచర్ మురళీధర్, సాహితీవేత్త రమేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని అక్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి పోటీల్లో వర్షశ్రీ ప్రతిభ

గంభీరావుపేట, జనవరి 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని వర్షశ్రీ జిల్లా స్థాయి వ్యాసరచనలో ద్వితీయ స్థానంలో నిలిచింది. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో వర్షశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం అందుకున్నది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, అధ్యాపక బృందం అభినందించారు.

ప్రశంసాపత్రంతో వర్షశ్రీ

సేవాభావం అభినందనీయం

సిరిసిల్ల టౌన్, జనవరి 11: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో దారుల్‌ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణ, దారుల్‌ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ ఖుద్దూస్, ఇన్‌కేసార్ బాబా, రఫీ, సర్వర్, సలీంపాషా, సుఫియాన్, అజ్మత్ అన్సర్‌అలీ పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ రూరల్/చందుర్తి, జనవరి 11: వేములవాడ రూరల్ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని గురువారం వేములవాడలో ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వేణు, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా బాబు, సహాయ కార్యదర్శిగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా అజ్జు, ప్రశాంత్, సుధాకర్, అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే చందుర్తి మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంగాధర్ , ప్రధాన కార్యదర్శిగా నరేశ్, ఉపాధ్యక్షుడిగా విజయ్, కోశాధికారిగా శ్రీకాంత్, ఉప కోశాధికారిగా ఉదయ్ కుమార్, సలహాదారుడిగా కొడగంటి శ్రీకాంత్, గౌరవాధ్యక్షులుగా సురేశ్, యేసు కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 11: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని మండల కేంద్రంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు నర్సయ్య, లింగం, లక్ష్మారెడ్డి, గోగుల రమేశ్, శివరాత్రి లక్ష్మణ్, వెంకటి, రాజేందర్ ఉన్నారు.

చదువుతోపాటు సేవాభావం ఉండాలి

ఇల్లంతకుంట, జనవరి, 11: విద్యార్థులకు చదువు తోపాటు సేవాభావం ఉండాలని ఎంపీపీ ఊట్కూరు వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం జంగంరెడ్డిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు నిర్వహించగా ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కుమారస్వామి, మాజీ ఎంపీపీ ఐలయ్య, అధ్యాపకులు మల్లారెడ్డి, జీవన్ బాబు, లింగమూర్తి, ఉప సర్పంచ్ ఎల్లయ్య పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

తెలంగాణ చౌక్, జనవరి 11: పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి దేవయ్య ఆధ్వర్యంలో సుస్థిర జీవన విధానంపై వర్క్‌షాప్ నిర్వహించగా హాజరై మాట్లాడారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ పాఠశాలలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 50 పాఠశాలల నుంచి స్కూల్‌కు ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు చొప్పున వర్క్‌షాప్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. కర్బన ఉద్గారాలు తగ్గించడం, సహజ వనరుల వినియోగం, తడి, పొడి చెత్త మొదలగు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఇక్కడ డీఈవో రమేశ్‌కుమార్, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఉపాధ్యాయులు ఉన్నారు.

తెలంగాణ భవన్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

కేటీఆర్ సేన క్యాలెండర్ ఆవిష్కరణ

ముస్తాబాద్, జనవరి 11: రాష్ట్ర కేటీఆర్ సేన ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించినట్లు కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి కృష్ణరాయలు, ప్రధాన కార్యదర్శి స్వామి, ప్రచార కార్యదర్శి వేణు, జిల్లాల అధ్యక్షులు, సోషల్ మీడియా ఇన్‌చార్జిలు అక్రమ్, జహంగీర్, శ్రవణ్, నరేందర్‌చారి, కుమార్, సంతోష్, వెంకటేశ్, విజయ్, నాగరాజు, శివ, నరేశ్, పవన్, నితిన్, శరత్, రవీందర్, జోగిందర్‌సింగ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా రవాణాధికారి కొండల్‌రావు

రాజన్న సిరిసిల్ల, జనవరి 11 (నమస్తే తెలంగాణ): రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా రవాణాధికారి కొండల్‌రావు సూ చించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని అంతర్జాతీయ శిక్షణ సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15నుంచి ఫిబ్రవరి 14 వరకు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఏటా 4లక్షల 50వేల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా లక్షా 50వేల మంది మరణిస్తున్నారని వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలోని డ్రైవర్లకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు మండెపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ. 22కోట్లతో టైడ్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఐదు ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించినట్లు చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్ అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు మీడియా సహకారం ఎంతో అవసరమన్నారు. డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా 4వేల మందికి డ్రైవింగ్‌లో నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డ్రైవింగ్‌లో నైపుణ్య శిక్షణ పొందిన యువత దేశ, విదేశాల్లో మంచి వేతనాలు పొందుతున్నారన్నారు. సమావేశంలో డీపీఆర్‌వో మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాతో అనర్థాలు: ఎస్పీ

తెలంగాణ చౌక్,జనవరి 11: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలకు వినియోగించే మాంజాతో అనేక అనర్థాలు కలుగుతాయని, వాటిని వినియోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గాలి పటాలు ఎగరడం కోసం వినియోగించే గాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, మనుషులు, పర్యావరణానికి హాని చేస్తాయన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజాను నిషేధించామన్నారు. ఎవరైనా వినియోగించినా, విక్రయించినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

'భరోసా సెంటర్'లో దరఖాస్తులకు ఆహ్వానం

జిల్లాలో కొత్తగా ఏర్పాటు కాబోతున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపాదికన నియామకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కౌన్సిలర్ కం సెంటర్ కోఆర్డినేటర్-1, లీగల్ సపోర్టింగ్ పర్సన్-1, సపోర్టు నర్సు-2, రిసెప్షనిస్టు-1, ఏఎన్ఎం-1 పోస్టులకు అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https//womensaftywing.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పోక్సో చట్టాన్ని వినియోగించుకోవాలి

ఇల్లంతకుంట, జనవరి 11: మహిళలు, పిల్లలు అవసరమైనప్పుడు పోక్సో చట్టం వినియోగించుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ రోజా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే పోక్సో చట్టం ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించామన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, సఖీ సెంటర్, డయల్ 181పై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ పరమేశ్వర్, మహిళా సాధికారిత కౌన్సిలర్ దేవిక, హెచ్‌ఎం ప్రేమలత ఉన్నారు.

నక్సలైట్లమని బెదిరించిన వారిపై కేసు నమోదు

వేములవాడ రూరల్, జనవరి 11: నక్సలైట్లమని బెదిరించిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. గురువారం వేములవాడ పీఎస్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. నాంపెల్లి శివారులోని శాలరామన్నపల్లికి చెందిన ఓ వ్యక్తిని తిప్పాపూర్‌కు చెందిన మానుక కుంటయ్య, శాల రామన్నపల్లికి చెందిన పత్తెం మల్లేశం, బొల్గం మల్లేశం తాము నక్సలైట్లమని చెప్పి బెదిరించారు. బొల్గం మల్లేశం పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. ఆ భూమిని ట్రాక్టర్‌తో చదును చేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు బెదిరించినవారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

నిందితుడి అరెస్ట్

చందుర్తి, జనవరి 11: వృద్ధురాలిపై లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న ఆటోడ్రైవర్ తిరుపతి ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని ఆటోలో ఎక్కించుకొని లింగంపేట శివారు శ్మశానవాటిక వద్దకు తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడు సనుగుల నుంచి వేములవాడ వెళ్తుండగా మర్రిగడ్డ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నారు. ఆటోతో పాటు ఫోన్ స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి..?

సిరిసిల్ల రూరల్, జనవరి 11: తంగళ్లపల్లి మండలంలోని సిరిసిల్ల-సిద్దిపేట రహదారి ఆనుకొని ఉన్న ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక(17)కు అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి రెండ్రోజుల క్రితం వేములవాడ ప్రాంతంలోని అగ్రహారంలో ఓ ఫంక్షన్‌హాల్‌కు తీసుకెళ్లాడు. అదే రోజు ఆమెను సమీప గుట్టల్లోని నిర్మానుష్యమైన ప్రాంతానికి తీసుకెళ్లి మత్తు పదార్థాలు ఇచ్చి లైంగిక దాడి చేసినట్లు సమాచారం. మత్తులోంచి బయటకువచ్చిన తర్వాత ఇంటికి చేరుకున్న బాలిక సదరు విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గోప్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన లాయర్లు

గాంధీ చౌక్, జనవరి 11: హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ రమాదేవిని జిల్లా న్యాయవాదులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. సిరిసిల్ల కోర్టు ఆవరణలో ఈ నెల 27న ప్రారంభం కానున్న 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరారు. అనంతరం న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని జడ్జికి వినతిపత్రం అందించారు. ఇక్కడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శులు అనిల్, మారుతి, నాగరాజుగౌడ్, గోవర్ధన్, కిషన్, సీనియర్ న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, ధర్మేందర్, నరేశ్ ఉన్నారు.

విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 11: జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. సిరిసిల్లలోని తక్షశిల పాఠశాలలో విద్యార్థినులు రంగవల్లులు వేశారు. పతంగులు ఎగురేశారు.

సిరిసిల్లలోని తక్షశిల పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

బిల్డింగ్ అమ్మబడును

★కరీంనగర్‌లోని కొత్త యాస్వాడ హరిహర రోడ్ నెంబర్.2 గ్రౌండ్ ఫ్లోర్ ఓపెన్ ఫస్ట్ ఫ్లోర్ 2BHK ఉత్తరం ఫేసింగ్. 30 ఫీట్ రోడ్డు. గల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర|| సెల్: 9848034203.

NTK-317328

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

91827 77194

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన -తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **22 జనవరి 2024**న మ. **12.30**గం. నుండి మ. **3.30**గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	జగిత్యాల	xxxxxxxxxxxxx5213	మల్యాల అరుణ	56745	28 డిసెంబర్ 23	14.5	14.2
2	కరీంనగర్	xxxxxxxxxxxx7518	మహమ్మద్ మొయిజుద్దీన్	58022	28 డిసెంబర్ 23	14.8	14.6
3	పెద్దపల్లి	xxxxxxxxxxx0347	గుమ్మడి హరీష్	51618	28 డిసెంబర్ 23	13.1	12.8
4	రామగుండం	xxxxxxxxxxxxx5247	జర్పుల రవీందర్	48916	25 అక్టోబర్ 23	13.07	12.8

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. **12.30** గం. నుండి మ.**3.30**గం. మధ్య నిర్వహించబడును. సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను. **అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**